ప్రజాశక్తి

మంగళవారం 21 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఎమ్మెల్సీలుగా చంద్రగిరి, మర్రి

- ఎమ్మెల్యేల కోటాలో ఎంపిక
- ఫలించిన రాజశేఖర్ సుదీర్ఘ నిరీక్షణ
- బిసి కోటాలో ఏసురత్నంకు జాక్‌పాట్



మర్రి రాజశేఖర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వచ్చే నెలలో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవులకు జరిగే ఎన్నికలకు వైసిపి నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకులు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం ఎంపికయ్యారు. గతంలో వైసిపి ఉమ్మడి గుంటూరు జిల్లా జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన మర్రి రాజశేఖర్‌కు ఆర్థిక సమస్యల కారణంగా 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి పోటీ చేసే అవకాశం లభించలేదు. చిలకలూరిపేట నుంచి 2019లో వైసిపి తరుపున విడదల రజనీకి టిక్కెట్ ఇవ్వగా ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2022 ఏప్రిల్‌లో రజనీ మంత్రి అయ్యారు. అయితే 2018 పాదయాత్రలోనూ, 2019 ఎన్నికల ప్రచార సభలో మర్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తానని వైఎస్ జగన్ చిలకలూరిపేట నియోజకవర్గం ప్రజలకు హామీ ఇచ్చారు.

▶ 2లో



చంద్రగిరి ఏసురత్నంకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా

చంద్రగిరి ఏసురత్నం భారీ ర్యాలీ

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్‌ను వైసిపి నాయకులు పలువురు అభినందించారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన చంద్రగిరి ఏసురత్నం స్థానిక గడ్డిపాడు బైపాస్ నుంచి గుజ్జనగుండ్ల వరకు సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో మార్కెట్ సెంటర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలేశారు. పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలేశారు. మంగళదాస్ నగర్‌లో తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయం వద్ద కొంతసేపు ఆగారు. ఏసురత్నంకు ఎమ్మెల్యే ముస్తాఫా, ఆయన కుమార్తె నూరిఫాతిమా బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తరువాత ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి బొకే ఇచ్చారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు వచ్చిన మర్రి రాజశేఖర్‌ను బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పలువురు వైసిపి నాయకులు కలిసి సత్కరించారు.





కురను రుచిచూస్తున్న ఎంఇఒ కె.శ్రీలక్ష్మి, పెట్టెలో ఉంచిన తమ ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థి

గురుకుల నిర్వహణపై ఎంఇఒ ఆగ్రహం

- సమస్యల పరిష్కారానికి ఆదేశం - ప్రజాశక్తి కథనానికి స్పందన
- సొంత భవన నిర్మాణం కోసం స్థల దాత ముందుకు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలుర) నిర్వహణ విషయంలో ఉపాధ్యాయులు, సిబ్బందిపై మండల విద్యాశాఖాధికారి కె.లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గురుకులం..దయానియం' శీర్షికతో ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఎంఇఒ పురుషోత్తపట్నంలోని గురుకుల పాఠశాలను సిఆర్‌పి శివపార్వతితో కలిసి సోమవారం పరిశీలించారు. ఇక్కడున్న 90 మంది విద్యార్థులకుగాను ఏడు మరుగుదొడ్లు, 3 స్నానపు గదులు ఉన్నాయని, అయితే అవి బాగోలేదని చెప్పారు. మరుగుదొడ్లు తరచూ నిండిపోతుండడంతో పరదాలు కట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఉపాధ్యాయులు చెప్పడంతో వారిపై మండిపడ్డారు. బ్లీచింగ్ చల్లించి పరిశుభ్రత చర్యలు చేయించారు. మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఉదయం టిఫిన్‌గా పెట్టిన కిచిడీ సరిగా ఉడకలేదని, సరిగా తినలేకపోయామని పిల్లలు చెప్పడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మళ్లీ జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కూరలో ఉప్పు, కారం ఎక్కువవడంతో వంట వారిపైనా ఆగ్రహానికి గురయ్యారు. బియ్యం, మరుగుదొడ్ల అంశంపై జిల్లా గిరిజన

▶ 2లో

విద్యుద్ఘాతంతో రీడర్ మృతి

ప్రభ తిరిగొచ్చాక ఇళ్లకు కనెక్షన్లను పునరుద్ధరిస్తుండగా ఘటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు





ప్రత్తిపాడు ఆస్పత్రిలో రాజశేఖర్ మృతదేహం, ఇన్‌సెట్లో మృతుడు రాజశేఖర్ (ఫైల్)

విద్యుద్ఘాతంతో విద్యుత్ మీటర్ రీడర్ మృత్యువాత పడిన ఘటన మండలంలోని గొట్టిపాడులో సోమవారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబీకుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల రాజశేఖర్ (30) విద్యుత్ శాఖలో పదేళ్ల నుండి మీటర్ రీడర్‌గా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నడింపాలెం, రాయపాటివారిపాలెం, తుమ్మలపాలెం గ్రామాలకు పనిచేస్తున్నాడు. మూడు గ్రామాల్లో 1-10 తేదీల్లో బిల్లింగ్ అనంతరం విద్యుత్ శాఖలోనే చిన్నచిన్న పనులు చేస్తుంటాడు. ప్రతిఏటా కోటప్పకొండ తిరునాళ్లకు గొట్టిపాడు నుండి ప్రభ వెళ్తుంది. ప్రభ వెళ్లే సందర్భంగా విద్యుత్ తీగలకు తగలకుండా ఉండాలనే ఉద్దేశంతో సర్వీసు వైర్లను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగిస్తుంటారు. ప్రభ తిరిగి వచ్చాక మళ్లీ కనెక్షన్లు ఇస్తుంటారు. ఇదే తరహాలో ఈసారీ సర్వీస వైర్లను కట్ చేశారు. ప్రభ ఆదివారం తిరిగి రావడంతో సోమవారం ఉదయం సర్వీసు వైర్లను తిరిగి పునరుద్ధరణ చేపట్టారు. ఈ పనుల్లో లైన్‌మెన్‌తోపాటు ఇద్దరు మీటరు రీటర్లూ నిమగ్నమయ్యారు. మరో మీటర్ రీడర్ దయాకర్ విద్యుత్ స్తంభం ఎక్కగా అతనికి వైర్లను రాజశేఖర్ అందిస్తున్నాడు. పాలకేంద్రం వద్ద ఇంటికి సర్వీసు వైపును బిగించే క్రమంలో రాజశేఖర్ వైరు అందిస్తుండగా ఆ ఇంటికి సంబంధించిన ఇన్వర్టర్ ఆన్‌చేసి ఉండడంతో దాని విద్యుత్ వైరుద్వారా ప్రసరించి రాజశేఖర్ రొమ్ము

▶ 2లో

హత్య కేసులు ముగ్గురికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

హత్య కేసులో ముగ్గురు వ్యక్తులకు పదేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమాన, ఐదుగురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ గుంటూరు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి అర్చన సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2015లో తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో గారపాటి అబ్రహాం, మాణిక్యరావు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా ఘర్షణ జరుగుతుంది. గ్రామ పెద్దగా

▶ 2లో

ముఖ ఆధారిత హాజరు యాప్‌లో నమోదు తప్పనిసరి : జెసి

ప్రజాశక్తి-గుంటూరు

సిఎఫ్ఎంఎస్‌లో 010 పద్దు ద్వారా జీతం పొందే ప్రతి ఉద్యోగీ ఏపి ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదై ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా వేయాలని జిల్లా అధికారులకు సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి చెప్పారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జెసి

▶ 2లో



ఖాళీబిందెలు, ప్రజాశక్తి క్లిప్పింగులతో రాస్తోరోకో చేస్తున్న గ్రామస్తులు

ఎన్నాళ్లీ మురుగు నీళ్లు తాగాలి..!

- కొలకలూరు ఎస్సీ కాలనీ వాసులు రాస్తారోకో
- తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ - ఆందోళనకు సిపిఎం మద్దతు
- గ్రామానికి హుటాహుటిన వచ్చిన డిపిఒ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు - అధికారుల హామీతో ఆందోళన విరమణ

8లో

గురుకుల నిర్వహణపై ఎంఇఒ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)


బీరువాలో ఉంచిన ఆట వస్తువులు

సంక్షేమాధికారి ఎల్. వరలక్ష్మికి ఫోన్ ద్వారా ఎంఇఒ మాట్లాడారు. దొడ్డు బియ్యాన్ని మార్పించి సాయంత్రానికి సన్నబియ్యం ఇప్పిస్తామని, మరుగుదొడ్లను బాగు చేయించేందుకు ప్రత్యేకంగా నిధులు ఇప్పిస్తామని సంక్షేమాధికారి చెప్పారు.

విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వినియోగంపైనా ఆరా తీశారు. విద్యార్థులు వాటిని దాచుకున్నారని, సరిగా ఉపయోగించడం లేదని తెలిసి ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ట్యాబుల్లో తెగులు, ఇంగ్లీష్, హిందీ లేవని, సైన్స్, సోషల్, లెక్కలు మాత్రమే ఉన్నాయని ఉపాధ్యాయులు చెప్పారు. కొంతమంది ఉపాధ్యాయులకు ట్యాబులు లేవని అన్నారు. దాచుకుంటే ఎలాగని, వాటి ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలు నేర్చుకునేలా శిక్షణివ్వాలని ఎంఇఒ ఆదేశించారు. ఆట వస్తువులు బీరువాలో ఉంచడానికి కాదని, పిల్లల్ని ఆడించడానికని పిఇటిపైనా అసంతృప్తికి గురయ్యారు.

ఇదిలా ఉండగా గురుకులానికి నూతన భవన నిర్మాణానికి గతంలో నిధులు మంజూరవగా పనులు చేయిచుకోని కారణంగా వెనుక్కు వెళ్లాయని, ఈ నిర్లక్ష్యం ఎందుకని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. స్థలం లేదనే సమాధానం ఉపాధ్యాయుల నుండి వచ్చింది. అయితే ఇప్పుడున్న ఈ స్థలాన్ని ఉచితంగా ఇస్తామని గతంలో చెప్పినట్లు స్థల దాత తనకు ప్రజాశక్తిలో కథనాన్ని చూసి చెప్పారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. తానే ఉన్నతాధికారులతో చెబుతానని అన్నారు. స్థలాన్ని దానమివ్వడానికి వచ్చిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీలుగా చంద్రగిరి, మర్రి

(మొదటి పేజీ తరువాయి)

వేర్వేరు కారణాలతో నాలుగేళ్లుగా ఆయనకు పదవి లభించలేదు. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీ అమలు చేయలేదన్న అపవాదు నుంచి బయటపడానికి మర్రి రాజశేఖర్‌కు ఈసారి అవకాశం కల్పించారు.

2004 నుంచి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన మర్రి రాజశేఖర్ గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. 2019లో కాంగ్రెస్ టిక్కెట్టు రాకపోవడంతో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత కాంగ్రెస్ అనుబంధ సభ్యుడిగా కొనసాగారు. 2010లో ఆయన వైసిపిలో చేరారు. ఆ తరువాత జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యారు. 2015 వరకు జిల్లా అధ్యక్షులుగా కొనసాగారు. అయితే 2019లో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్లుగా పలుమార్లు ఎమ్మెల్సీ పదవులకు రాజశేఖర్ పేరు ప్రచారంలోకి వచ్చినా మొండిచేయి చూపారు. 2022లో వైసిపి కృష్ణా, గుంటూరు జిల్లాల సమన్వయకర్తగా నియమించారు. త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో ఆయనకు అవకాశం ఇస్తారా? లేదా? అనేది చర్చనీయాంశమైంది.

మిర్చియార్డు చైర్మన్‌గా మూడు సార్లు...

గుంటూరు మిర్చియార్డు చైర్మన్‌గా చంద్రగిరి ఏసురత్నం మూడుసార్లు నియమితులై మూడేళ్లుగా ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. తాజాగా ఆయన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఐపిఎస్ అధికారిగా పని చేసిన ఏసురత్నం సుదీర్ఘకాలం పాటు పలువురు ముఖ్యమంత్రుల వద్ద సెక్యూరిటీ అధికారిగా పనిచేశారు. డిఐజి హోదాలో 2018లో ఉద్యోగ విరమణ అనంతరం వైసిపిలో చేరారు. 2019లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పట్లో టిడిపి అభ్యర్థి మద్దాలి గిరి చేతిలో ఓడిపోయారు. ఓడిపోయిన అభ్యర్థులందరికి ఏదో ఒక పదవి ఇచ్చి సంతృప్తి పరిచిన సిఎం జగన్ చంద్రగిరికి మిర్చి యార్డుచైర్మన్ పదవికి ఎంపిక చేశారు. మూడుసార్లుకు మించి యార్డు చైర్మన్ పదవి చేయడానికి అవకాశం లేకపోవడంతో ఈసారి ఏకంగా ఆయన్ను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు.

జెకెసి కళాశాల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే మద్దాలి

పార్టీలకతీతంగా గుంటూరు నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం గుంటూరు నగరంలోని 42వ డివిజన్‌లోని జెకెసి కళాశాల రింగు రోడ్డు నుంచి శ్రీ మౌర్య కన్వెన్షన్ వరకు రోడ్ విస్తరణ 15 మీటర్ల మేర రహదారి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే మద్దాలి గిరితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరులో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా అనేక ప్రధాన రహదారులను విస్తరణ చేస్తున్నామన్నారు. 42వ డివిజన్‌లో జేకేసి కాలేజీ రోడ్డును రూ. 1.83 కోట్లతో విస్తరించి బిటి రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. అన్ని వార్డులలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలియచేశారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు నగరాబివృద్ధికి నగర పాలక సంస్థ విలీన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలియచేశారు. కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, అందుగుల సంతోష్, వైసిపి ఇంచార్జ్ బోగిసం ప్రసాద్, చల్లా చేషిరెడ్డి, ఈఈ సుందరరామి రెడ్డి, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-గుంటూరు



నగరపాలక సంస్థలో కార్మికులకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తూ మరణించిన కార్మికురాలు బత్తుల సుగుణ భర్తకు రూ.2లక్షల చెక్కును సోమవారం జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో కమిషనర్ అందించారు. కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు జిఎంసి అండగా ఉంటుందన్నారు. అలాగే నగరపాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగ సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు.

విద్యుద్ఘాతంతో రీడర్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

భాగానికి తగలడంతో కుప్పకూలి పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఆర్ఎంపి వద్దకు ఆటోలో తీసుకెళ్లారు. అక్కడి నుండి చిన్నకొండ్రుపాడులోని కాటూరి హాస్పటల్‌కు అక్కడి నుండి ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజశేఖర్ మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. లైన్‌మెన్ చేయాల్సిన పనులను మీటర్ రీడర్లతో ఎందుకు చేయించారని, ఈ ఘటనకు వారు బాధ్యత వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ఆస్పత్రిలో ఉంచగా విదేకచతఖ శాఖాధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి మృతుని కుటుంబీకులతో చర్చిస్తున్నారు. మృతుని భార్య వెంకటవాణి కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆరోగ్య రాజు తెలిపారు.

హత్య కేసులు ముగ్గురికి పదేళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న గారపాటి జాలశౌరి గొడవలు మానుకోవాలని గారపాటి అబ్రహంకు సూచించారు. దీంతో గారపాటి బాలశౌరి తనకు అడ్డువస్తున్నాడని భావించి తన కుమారులు, బంధువులు దాదాపు 18 మందితో గారపాటి బాలశౌరి ఇంటిపై దాడి చేశాడు. ఈ దాడిలో గారపాటి బాలశౌరి మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. మృతుని కుమారుడు గారపాటి చిన్నా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. అప్పటి మంగళగిరి రూరల్ సిఐ సిహెచ్ కోటేశ్వరరావు విచారణ పూర్తి చేసి చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో 3,4,5వ ముద్దాయిలు దార్ల కోటేశ్వరరావు, తుమ్మలగుంట శౌరిబాబు, కొరివి నాగరాజు ల కు పదేళ్ల జైలు, ఆరు, ఏడు, తొమ్మిది, పది, పదహారో ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి వి సూరిబాబు కేసు వాదించారు.

ముఖ ఆధారిత హాజరు యాప్‌లో నమోదు తప్పనిసరి : జెసి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులంతా తమ పరిధిలో రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను యాప్‌లో నమోదు చేయాలన్నారు. యాప్‌లో నమోదుకు, హాజరుకు సంబంధం లేదని, వికలాంగులకు ముఖ ఆధారిత హాజరు నుండి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. సిఎఫ్ఎంఎస్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌తో ఎంత మందైనా నమోదవ్వొచ్చని, సిఎఫ్ఎంఎస్‌తో లింక్ అయి మొబైల్ నంబర్ అందుబాటులో లేకపోతే సిఎఫ్ఎంఎస్‌లో కొత్త మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని వివరించారు. ఒకే డీడీఓ రెగ్యులర్, ఇన్‌ఛార్జిగా ఉన్నచోట ఇన్‌ఛార్జి కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరు వేయడానికి నమోదు అవ్వట్లేదని, గ్రంథాలయాలు, యూనివర్శిటీలు పీడీ అకౌంటు కలిగి ఉన్నాయని, వారు ఏ విధంగా నమోదు చేసుకోవాలి..? అని పలు సందేహాలను అధికారులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మల్లేశ్వరస్వామి రథోత్సవం


పెదకాకానిలో బ్రమరాంభ సమేత మల్లేశ్వరస్వామివార్ల రథోత్సవం

ప్రజాశక్తి-తెనాలి: మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం పెదకాకానిలోని గంగా భ్రమరాంబా సమేత శ్రీ మల్లిఖార్జునస్వామివార్ల దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివార్లను అలకంరించారు. రథోత్సవంలో ఇంటింటా స్వామివారికి భక్తులు హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయక కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా, సందర్శకులకు కన్నుల పండువగా జరుగుతున్నాయన్నారు. ఉత్సవాల్లో చివరిరోజైన మంగళవారం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, వసంతోత్సవం, అశ్వవాహనంపై గ్రామోత్సవం, అలాగే సాయంత్రం 4.30 గంటలకు స్వామివారికి, అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెప్పోత్సవానికి అవసరమైన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సందర్శకులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

పది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలోని యనమదల జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పది విద్యార్థులకు జడ్పిటీసి కృష్ణారెడ్డి అల్పహార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్యార్థుల బావిష్యత్ కోసం ఎంతో ప్రాధాన్యత నిస్తున్నారని అన్నారు. పాఠశాల లో మౌలిక వసతులు, ఇంగ్లీష్‌మీడీయం తరగతులతో నూతన ఒరవడిని సృష్టించారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినీయోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ప్రధానో పాధ్యాయులు రమాదేవి, వైస్ ప్రెసిడెంట్ బాపతు వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గోడ్డు గోరు ఆది నారాయణ, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, యనమదల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటేశ్వరరావు, ఎంపిటీసి ఎన్. స్వప్నలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి -మంగళగిరి

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ నుండి వచ్చేనెల 9వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. దేవస్థానం దిగు సన్నిధిలో సోమవారం బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ జివి రాంప్రసాద్ అధ్యక్ష వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్యమైన సందర్శకులకు కూడా దర్శనం అందేలా చూడాలని కోరారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు , రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ఆలయ ఈఓ ఏ రామకోటి రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడిఈ ఏ సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీ గణపతి రావ్, పట్టణ సిఐ ఏ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను, పోస్టరును ఆవిష్కరించారు.

బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సీఎం

ప్రజాశక్తి-మంగళగిరి:

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి బీసీల ఆత్మగౌరవాన్ని మరోమారు నిలబెట్టారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం మంగళగిరిలో ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాపై చిరంజీవి స్పందిస్తూ 18 పదవులకుగాను 11 స్థానాలను బీసీలకు, 2 స్థానాలను ఎస్సీలకు, ఒక స్థానాన్ని ఎస్టీలకు కేటాయించి వెనుక బడిన వర్గాల సంక్షేమంపై తనకు ఉన్న చిత్తశుద్ధిని మరోమారు నిరూపించుకున్నారని చెప్పారు. అందులో చేనేత వర్గాలకు కూడా సముచిత స్థానం కల్పించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్ కు ఆప్కో చైర్మన్ చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టుషాపులను అరికట్టండి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో మద్యం బెల్టుషాపులు, గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలని సిపిఎం తాడేపల్లి కొత్తూరు శాఖ కార్యదర్శి దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి నివాసానికి సమీపంలోనే మద్యం ఏరులైపారుతోందని విమర్శించారు. గతంలో సీఎం నివాసానికి దగ్గర్లో ఉన్న పశువుల ఆసుపత్రి సెంటర్‌లో మద్దెల నాగరాజుపై హత్యాయత్నం జరగడాన్ని గుర్తు చేశారు. ఇటీవల ఎన్‌టిఆర్ కట్టపై 17 ఏళ్ల అంధురాలిని హత్య చేయడం కూడా జరిగిందని చెప్పారు. మద్యం, గంజాయి మత్తు పదార్థాల ప్రభావంవల్లే ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పారు. పోలీస్ అధికారులు ఇప్పటికైనా స్పందించి బెల్టుషాపులను నియంత్రించడంతో పాటు గంజాయి, మత్తు పదార్థాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలోత్సవం విజయవంతానికి సహకరించిన వారికి అభినందనలు : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహించిన గుంటూరు జిల్లా బాలోత్సం విజయవంతం కావటానికి సహకరించిన పాఠశాలల యాజమా న్యాలకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ, బాలోత్సవం అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు అభినందనలు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవం నిర్వహణలో పాల్పంచుకున్న సభ్యులు, వాలంటీర్లకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలోత్సవం కన్వీనర్లుగా వ్యవహరించిన డాక్టర్ యం.బోసుబాబు, కెవిఎస్ దుర్గాప్రసాద్, చావా శ్రీనివాస్, కుర్రా శ్రీనివాస్, తదితరులను అభినందించారు. అలాగే వాలంటీర్లుగా వ్యవహరించిన చలపతి ఫార్మసీ కాలేజి విద్యార్థులు, ఉమెన్స్ కాలేజి విద్యార్థులను, అభినందించారు. కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి బి.ప్రసాద్, ఇ.అనిల్‌కుమార్, టి.జాన్‌బాబు, జి.వెంకటరావు, బి.శంకర్‌సింగ్, టి.ఆర్.రమేష్, డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, వి.రామ్మోహన్, డాక్టర్ వసుంధర, ఆర్.స్వాతి పాల్గొన్నారు.



డాక్టర్ బోసుబాబును సన్మానిస్తున్న కెఎస్ లక్ష్మణరావు

విద్యుత్ ప్రభ విరిగిన ఘటనలో యువకుడు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల



విద్యుత్ ప్రభ విరిగిపడిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. గురజాల మండలం గంగవరం గ్రామానికి చెందిన పేరు పోగు శ్యామ కుమార్(23) గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమ వారం మృతి చెందినట్లు ఎస్సై సమీర్ బాషా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రెంటచింతల మండలంలోని సత్రశాలలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు ప్రభ విరిగిపడడంతో ఈ నెల 18న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలయ్యాయి.

42 మంది జూదరులను బైండోవర్ చేసిన పోలీసులు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ మట్కా, జూదం ఆడుతున్న 42 మంది జుదరులను సోమవారం పొన్నూరు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ వేణు ఎదుట అర్బన్ పోలీసులు హాజరు పరిచారు.డిప్యూటీ తహశీల్దారు మాట్లాడుతూ సమాజంలో పేద, బడుగు, వర్గా లను ఆర్థికంగా నష్ట పరిచే మట్కా, జూదం ఆడటం నేరమని అన్నారు. సత్ప్రవర్తనతో మసులుకోవాలని జూదరులను హెచ్చరించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,11,605
మిర్చి ఎగుమతి	: 1,07,640
మిర్చి నిల్వ	: 81,753

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 19,200
నెం.5	10,000 - 20,000
273	15,000 - 19,500
341	11,000 - 21,000
4884	14,000 - 17,300
సూపర్ 10	17,000 - 19,000
నాన్ ఎసి	
తేజ	7,000 - 20,000
బడిగి	9,000 - 25,500
దేవనూరు డీలక్స్	14,000 - 21,500
తాలుకాయలు	5,000 - 12,000

70శాతం సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో గతేడాది 70 శాతం సిలబస్‌తో ఇంటర్ పరీక్షలు రాసి, ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ ఏడాది కూడా అంతే సిలబస్‌తో సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించాలని యువ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీసు సొసైటీ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్, స్టేట్ అడిషనల్ సెక్రెటరీ పులుగు దీపక్ కోరారు. ఈమేరకు ఇంటర్‌మీడియట్ కమిషనర్ శేషగిరిరావుకు వినతిపత్రం అందచేశారు. గతేడాది 70శాతం సిలబస్‌తో పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ సంవత్సరం వందశాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తే మళ్లీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందన్నారు. కావున గత రెండు సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు 70 శాతం సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించి, వారికి న్యాయం చేయాలని కోరారు.

ఆటో బోల్తా -కూలీలకు గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు సమీపంలో సోమ వారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో కొమెరపూడి కి చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. కొమెర పూడి నుండి రోజూ నందిగామ, గుడిపూడి గ్రామాల్లో మిర్చి కోతలకు కూలీలు వెళుతుంటారు. మిర్చి కోత పనులు ముగించుకుని ఇంటికి ఆటోలో తిరిగి వస్తుండగా అడ్డరోడ్డు సమీపంలో వున్న పెట్రోల్ బంక్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సుభానీ, కూలీలు కూర పాటి మాలిన్ బీ,సైదాబీ షకీలాలు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలల రక్షణపై రాష్ట్ర స్థాయి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

బాలల రక్షణకు చట్టబద్ధంగా ఏర్పాటుచేయబడిన వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులకు మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండ్రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో సోమవారం ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బాలల రక్షణకు పని చేస్తున్న జిల్లా స్థాయి అధికారులు, జిల్లా బాలల పరిరక్షణా విభాగ అధికారులు, బాలల సంక్షేమ సమితులు, బాలల న్యాయమండలి సభ్యులు, ప్రత్యక దత్తత సంస్థల నిర్వాహకులు, వన్ స్టాప్ కేంద్రాల నిర్వాహకులు హాజరయ్యారు. వారికి బాలల రక్షణకై ఉద్దేశించిన చట్టాలు, విధి విధానాలు, నిర్దేశకాల అమలులో ఎదురయ్యే ఇబ్బందులు, సందేహాలు, సమన్వయ లోపాలు, వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది పాత్ర, బాల న్యాయ చట్టం , మిషన్ వాత్సల్య పథకం, దత్తత విధి విధానాలు, స్పాన్సర్ షిప్ , ఫోస్టర్ కేర్, ఆఫ్టర్ కేర్, పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్ , బాలల రక్షణ సధనాలు, బాధిత నష్ట పరిహార పథకం , బాలలపై లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం, చట్టంతో విబేధించబడిన బాలల పునరావాసము, బాలలలో మత్తు పదార్థాల వాడకము నివారణ చర్యలు, క్రమ రవాణా నిరోధ చర్యలు తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, వివిధ కమిటీల చైర్‌పర్సన్‌లు హాజరయ్యారు.



సమస్యను పరిశీలిస్తున్న కమిటీ

స్పందన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీలు

వినూత్న తరహాలో నిర్వహణకు పల్నాడు కలెక్టర్ శ్రీకారం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'స్పందన' వినూత్న తరహాలో జరిగింది. రెవెన్యూ, సచివాలయాలు, మహిళా శిశు సంక్షేమం, ఆరోగ్యం వంటి 3 ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ఒకొక్క విభాగానికి ఐదుగురు జిల్లా అధికారులను నియమించారు. అర్జీలను ఆయా అధికారులు నిశితంగా పరిశీలించి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. దీంతోపాటు అర్జీదార్ల కోసం షామియానా ఏర్పాటు చేయించడంతోపాటు వాలంటీర్ల ద్వారా సమస్య ఆధారంగా అర్జీలను రాయించే ఏర్పాటూ చేశారు. తమ పొలాను రికార్డుల్లో 22/ఎగా నమోదు చేశారని, తొలగించాలని దుర్గి మండలం ఆత్మకూరుకు చెందిన చప్పాల తిరుపతమ్మ, బెల్లంకొండ మండల కేంద్రానికి చెందిన వసంతపు జగన్నాథం కోరగా ఆ సమస్యను రెవెన్యూ అధికారులు కమిటీ వెంటనే పరిష్కరించింది. కార్యక్రమంలో జెసి శ్యామ్‌ప్రసాద్, స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, వరలక్ష్మి పాల్గొనగా వివిధ అంశాలపై 127 ఫిర్యాదులు వచ్చాయి.

ఇదిలా ఉండగా శివరాత్రి సందర్భంగా నరసరావుపేట మండలం కేసానుపల్లిలో టిడిపి కార్యకర్తలపై వైసిపికి చెందినవారు దాడి చేశారని, పైగా ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టం కింద కేసులు పెట్టించారని కలెక్టర్‌కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఫిర్యాదు చేశారు. పండగలకు కూడా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ రంగు పులుపుతున్నారని, కేసానుపల్లి, ఎలమందల గ్రామాల్లో గొడవలు సృష్టించి టిడిపి కార్యకర్తలపై కేసులు పెట్టించారని ఆరోపించారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.



సమస్యను పరిశీలిస్తున్న కమిటీ

డబ్బుల విషయంలో వక్రీకరణ : ఎస్పీ

ప్రజాశక్తి - నరసరావుపేట

చోరీ కేసులో శిక్ష అనుభవిస్తున్న వ్యక్తిని కేసు నుండి తప్పించడానికి మాచర్ల సిఐ రూ.1.20 లక్షలు డిమాండ్ చేశాడని తల్లి స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వస్తే పోలీసులు అడ్డుకున్నారని మీడియాలో వచ్చిన వార్తను ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో నిందితుడైన వ్యక్తి తాము దొంగిలించిన సొమ్ములో రూ.1.20 లక్షలు వాడుకున్నాడని, వాటిని తిరిగిస్తే వాటిని బాధితులకు అందజేస్తామని నిందితుడి కుటుంబ సభ్యులకు మాచర్ల సిఐ చెప్పారని పేర్కొన్నారు. అయితే వారు దాన్ని వక్రీకరించారని, సిఐ నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి విషయాల్లో మీడియా సంయమనం పాటించాలని, నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు.

అయిన వారి నుండే ఆర్థిక మోసాలు



అర్జీదార్ల సమస్యలు వింటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట


పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో వివిధ సమస్యలపై ప్రజలు 54 ఫిర్యాదు అందించగా వాటిని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి స్వీకరించారు. తోబుట్టువులు, బంధువులే తమను మోసం చేశారని పలువురు ఎస్పీ ఎదుట వాపోయారు. అనాథనైన తనకు స్నేహితుల ద్వారా పరిచయమైన పేరేచర్లకు చెందిన గాలి స్వప్న ఉద్యోగం పేరుతో మోసం చేసిందని, పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆమె బంధువైన చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్లో రైటర్ ద్వారా బెదిరింపులకు పాల్పడుతోందని యువతి ఫిర్యాదు చేశారు. మరో యువతి.. తనకు అబద్ధాలు చెప్పి ఈనెల 2న పెళ్లి చేశారని, తాను మోసపోయానని నరసరావుపేటకు చెందిన యువకునిపై సత్తెనపల్లికి చెందిన యువతి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, దిశా డీఎస్పీ యు.రవిచంద్ర, సిఐ సుభాషిణి, ఎస్ఐలు పాల్గొన్నారు.



విడాకుల కోసం రూ.10 లక్షల ఆఫర్

విడాకులు ఇస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ భర్త కుటుంబీకులు ఒత్తిడి, బెదిరింపులకు గురిచేస్తున్నారని ఈపూరు మండలం అగ్నిగుండాలకు చెందిన బి.లక్ష్మీభాగ్యలక్ష్మీ ఫిర్యాదు చేశారు. తాను, తన భర్త బొడ్డు శ్రీనివాసరావు ప్రేమించుకున్నామని, పెద్దలను ఎదిరించి మూడేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నామని, తమకు 8 నెలల బాబు ఉన్నాడని తెలిపారు. అయితే తన భర్త ఇప్పుడు వారి తల్లిదండ్రుల మాటలు వింటూ మరో పెళ్లికి సిద్ధమయ్యాడని, మేనకోడలిని పెళ్లి చేసుకోవడానికి తన నుండి విడాకులు కోరుతున్నాడని తెలిపారు. భర్త తల్లిదండ్రులు తనను కులం పేరుతో దూషించారని, దీనిపై ఈపూరు, వినుకొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం దక్కలేదని వాపోయారు.

పొలం డబ్బులో వాటా కోసం బెదిరింపు



తమ పొలాన్ని అమ్మితే వచ్చే డబ్బులో వాటా కోసం బంధువు బెదిరిస్తున్నారని బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మిన్నెకల్లుకు చెందిన జిర్రా కృపయ్య ఫిర్యాదు చేశారు. తన భార్య పేరుమీద నరసరావుపేట మండలం కాకాని రెవిన్యూ పరిధిలోని అర్వపల్లిలో అరెకరం పొలం ఉందని, ఆరోగ్య, ఆర్థిక పరిస్థితుల వల్ల దాన్ని అమ్ముకుందామనుకుంటే బేరాలను కాకాని గ్రామంలోని తమ సమీప బంధువైన కోంద్రు వీరయ్య చెడగొడుతున్నాడని చెప్పారు. ఆ పొలాన్ని అమ్మితే వచ్చే డబ్బులో సగం అతనికివ్వాలని అంటున్నాడని, లేకుంటే పొలాన్ని అమ్మనీయనని బెదిరిస్తున్నారని వాపోయాడు.

ఉద్యోగం పేరుతో రూ.3 లక్షల మోసం



వికలాంగుడినైనా తనకు గుంటూరు వికలాంగుల కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అదే కార్యాలయంలో పని చేస్తున్న సాంబశివరావు నమ్మించాడని, రూ.3 లక్షలు డబ్బుకూడా తీసుకున్నాడని రొంపిచర్ల మండలం రైతు నగర్‌కు చెందిన ఏలూరి భరత్ ఫిర్యాదు చేశారు. పదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో తాను కుడి మోచేయి వరకూ కోల్పోయానని, ఉద్యోగం వస్తుందనే ఆశతో నా తండ్రి రాంప్రసాద్ అప్పు చేసి సాంబశివరావకు డబ్బులిచ్చాడని వివరించారు. మూడేళ్లయినా ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు కూడా తిరిగివ్వడం లేదని చెప్పారు.

దాడి చేయించిన వారికే పోలీసుల వత్తాసు



తన వాటాగా రావాల్సిన 3.65 సెంట్ల స్థలాన్ని సోదరుడైన కొమ్మినేని వెంకట్రావు కాజేయలని చూస్తున్నాడని అమరావతి మండలం ధరణికోటకు చెందిన కొమ్మినేని గురువిష్ణు ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలోనే పెద్దల సమక్షంలో రాజీ చేసుకున్నామని, అయితే అధికార పార్టీ నాయకుల అండదండలతో తనపై దాడి చేయించాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు చేసినా...



తమ కుటుంబానికి చెందిన 23 సెంట్ల స్థలంలో 3 సెంట్లు రోడ్డు విస్తరణలో పోగా తన వాటా కింద 6 సెంట్లకు పైగా రావాల్సి ఉండగా సమీప బంధువులు మేకల కోటేశ్వరరావు, మేకల నాగేశ్వరరావు, మేకల రమేష్, తిరుమలేష్ తన వాటాను తగ్గించి హద్దు రాళ్లు వేశారని క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన మేకల పెద్దబ్బాయి ఫిర్యాదు చేశారు. స్థల ఆక్రమణపై ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు.

నా వాటాను కాజేయాలని చూస్తున్నారు..



వికలాంగుడినని కూడా చూడకుండా తోడపుట్టిన తమ్ముళ్లే మోసం చేసి తన వాటాకు రావాల్సిన రూ.30 లక్షలు ఇవ్వడం లేదని, 2.50 ఎకరాల పొలాన్నీ రిజిస్ట్రేషన్ చేయడం లేదని వినుకొండ మండలం అందుగుల కొత్తపాలేనికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై తాను మూడేళ్లుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగానని, 'స్పందన'లో నూ పలుమార్లు ఫిర్యాదు చేశానని, అయినా న్యాయం దక్కలేదని వాపోయారు.

కొడుకులే పట్టించుకోవడం లేదు



భర్త 30 ఏళ్ల కిందటే చనిపోయినా ముగ్గురు కొడుకులు, ఒక కూతుర్ని పెంచి పెద్ద చేశానని, అందరికీ పెళ్లిళ్లు కూడా చేశానని, అయితే తన కుమారులు ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదని మాచవరం మండల కేంద్రానికి చెందిన మునగాల లక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు. అందరికీ పెళ్లిళ్లు చేశాక వారికి ఆస్తిని పంచాగ తన వాటాగా 1.40 ఎరాల పొలం, రేకుల ఇల్లు, రూ.6 లక్షల నగదు వచ్చాయని చెప్పారు. అయితే డబ్బు, పొలాన్ని ఇవ్వకుండా కొడుకులు ఇబ్బంది పెడుతున్నారని, రేకుల షెడ్డులోనూ ఉండనీయకుండా ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు.

డ్యూటీకి వెళ్తే చంపుతామంటున్నారు



విధులకు వెళ్లాలంటే భయంగా ఉందని వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న చింతమల్లి చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన యలమంద, వీరబ్రహ్మాచారి ఇళ్లల్లో అదనంగా విద్యుత్ మీటర్లను విజిలెన్స్ అధికారులు తొలగించారని, వాటిని మళ్లీ పెట్టాలంటూ వారు తనపై ఒత్తిడి తెస్తున్నారని, నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నా వినడం లేదని అన్నారు. ఈ అంశంలోనే వెల్దుర్తి విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఒకసారి దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదుతో సరిపెట్టారని తెలిపారు. డ్యూటీకి వస్తే చంపుతాం.. అంటూ వారు బెదిరిస్తున్నారని, పైగా రాజీకి రావాలంటూ మాచర్ల రూరల్ సిఐ ఒత్తిడి చేస్తున్నారని వివరించారు.

పొలం మొత్తాన్ని చెల్లి కాజేసింది



తన వాటాగా రావాల్సిన పొలాన్ని నకిలీ పత్రాలతో సోదరి కాజేసిందని ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన జక్కుల పుల్లమ్మ ఫిర్యాదు చేశారు. మాచవరం మండలం మోర్జంపాడులో తన చెల్లెలు వెంకటనర్సమ్మ ఉంటుందని, తమ తల్లిదండ్రులకు బెల్లంకొండ రెవెన్యూ పరిధిలో 18 ఎకరాల పొలం ఉందని తెలిపారు. 2021లో తల్లి మృతి చెందిందని, ఆస్తి పంపకాలపై తన సోదరితో మాట్లాడితే సమాధానం ఇవ్వకుండా పొలానికి కౌలు మాత్రమే ఇచ్చేదని చెప్పారు. అయితే తల్లిదండ్రులకు ఆమె ఒక్కతే కుమార్తె అంటూ ధ్రువపత్రాలను సృష్టించారని, అందుకు ఆమె కుమారుడు విజయభాస్కర్‌రెడ్డికి రెవెన్యూ అధికారులు సహకరించారని చెప్పారు. దీనిపై తాను మాచవరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఇంటిని భర్త సోదరుడు ఆక్రమించాడు



తన ఇంటిని బావ ఆక్రమించాడని యడ్లపాడు మండలం వంకాయలపాడు రెవెన్యూ పరిధి పల్లపు లక్ష్మీ ఫిర్యాదు చేశారు. తాను భర్త నుండి కొన్నేళ్ల కిందటే విడిపోయి ముగ్గురు పిల్లలతో విడిగా ఉంటున్నానని, భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఎటో వెళ్లిపోయాడని తెలిపారు. అయితే తన పేరుతో ఉన్న ఇంటిని భర్త సోదరుడు ముసలయ్య కబ్జా చేశాడని, ఒకసారి దాడి చూడా చేశారని, కోర్టులో కేసున్నా ఇంటిపైన మరో షెడ్డు వేశాడని, యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

కాలేజీపై బిఇడి విద్యార్థి ఫిర్యాదు



తనను కాలేజీ యాజమాన్యం కులం పేరుతో దూషించిందని మాచవరానికి చెందిన రామకృష్ణ ఫిర్యాదు చేశారు. తాను పిడుగురాళ్లలోని గీతిక కాలేజీలో బిఇడి చదువుతున్నానని, మొత్తం ఫీజు రూ.15 వేలకుగాను రూ.7 వేలను ఒకసారి, మిగతాది తర్వాత చెల్లిస్తానని చెప్పడంతో అంగీకరించారని చెప్పారు. అందులో భాగంగా తొలుత రూ.7 వేలు ఇచ్చి హాల్ టిక్కెట్, రికార్డులు ఇవ్వాలని అడిగితే ఇవ్వకుండా దూషించారని తెలిపారు.

క్షేత్రస్థాయిలోనే అర్జీలు పరిష్కరించాలి

సంయుక్త కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలకు తప్పకుండా రశీదులు ఇవ్వాలని సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి క్షేత్రస్థాయి అధికారుల్ని ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకటశివరామిరెడ్డి ప్రజల అర్జీలు స్వీకరించారు. ఈ స్పందనలో 126 మంది తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించటం జరుగుతుందని, నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లా అధికారులతో స్పందన అర్జీలపై సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే స్పందనలో అందే ప్రతి అర్జీ ముట్టినట్లుగా రశీదు తప్పక ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే స్పందనలో అర్జీలు స్వీకరించి పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కరించకుండా మండల స్థాయిలో ఇచ్చే అర్జీలకు, అలాగే మండల స్థాయిలో పరిష్కరించకుండా జిల్లా స్థాయిలో అందించే స్పందన అర్జీలకు సంబంధించి క్రింది స్థాయిలో ఇచ్చిన రశీదును పరిశీలించిన తర్వాత మాత్రమే అర్జీలను జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ఇకపై స్వీకరించడం జరుగుతుందన్నారు. కావున క్షేత్రాధికారులు వారి స్థాయిలోనే అర్జీలను స్వీకరించి సకాలంలో పరిష్కరించాలన్నారు. మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా రీఓపెన్ అవుతున్నట్లు పరిశీలనలో తెలిసిందన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జెసి, డిఆర్‌ఒ తదితరులు



పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో పనిచేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న 15 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాలని బాధితులు స్పందనలో అర్జీ అందచేశారు. జిజిహెచ్‌లో ఎఫ్ఎన్‌ఒ, లిఫ్ట్ ఆపరేటర్లు, డిఇఒలుగా, వివిధ విభాగాల్లో 43 మంది పనిచేశామన్నారు. నక్షత ఏజెన్సీ నుండి నియమితులైన తామకు సదరు ఏజెన్సీ పిఎఫ్ చెల్లించలేదన్నారు. అలాగే రెండు నెలల వేతన బకాయిలు కూడా ఉన్నాయన్నారు. దీనిపై జిజిహెచ్ అధికారులు ఏజెన్సీకి అన్నీ చెల్లించామని, బకాయిలు లేవని చెబుతున్నారని, ఏజెన్సీ వారు మాత్రం తమ ఖాతాల్లో జమ చేయలేదన్నారు. కావున తమకు న్యాయం చేయాలని పిఎఫ్, వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో డి.సతీష్‌నాయుడు, డి.వెంకటేశ్వరరావు, మరియదాసు, జి.నాగమణి ఉన్నారు.

గుంటూరు ఛానల్ సమస్యను పరిష్కరించాలి

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించాలి

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించటానికి సంబంధించి భూసేకరణకు రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, తదితరులు స్పందనలో అర్జీ అందజేశారు. భూసేకరణకు డిసెంబర్ నుండి గజిట్ నోటిఫికేషన్ ఇవ్వటం ప్రారంభించారని, అయితే భూసేకరణకు నిధులు కేటాయించనందున గజిట్ నోటిఫికేషన్ మొత్తం పూర్తి కాలేదన్నారు. భూసేకరణ అధికారి ఖాతాల్లోకి నిధులు కేటాయించకపోవటం వల్ల భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. కావున రైతుల్లో ఉన్న అపోహలు తొలగించి, మార్కెట్ ధర ప్రకారం రైతుల భూములకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. 85 ఏళ్లుగా గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రక్రియ హామీలతోనే గడిచిందని, ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ ఇంజనీర్‌కు, చీఫ్ ఇంజనీర్ సి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మ చౌదరి, నాయకులు కొల్లా రామన్, పెద్దన్న, లక్ష్మారెడ్డి, జి శ్రీనివాసరెడ్డి, ఎం హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న కొల్లా రాజమోహన్ తదితరులు

బడేపురం ఎస్సీల భూములు అక్రమణ

స్పందనలో బాధితులు ఆందోళన

తాడికొండ మండలం, బడేపురంలో కబ్జాకు గురైన ఎస్సీల భూములను విడిపించి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. తొలుత కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై రాస్తారోకో చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్ బయటకు రావాలని పట్టుబట్టారు.అధికారులు ఎవరూ స్పందించకపోవటంతో బాధితులు గేటు నెట్టుకొని స్పందన వద్దకు వచ్చి బైటాయించి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో డిఆర్‌ఒ చంద్రశేఖర్‌రావు, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, సిఐ హైమారావు నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1450లో ఎస్సీలు సాగు చేసుకుంటున్న భూముల్ని అగ్రవర్ణాలకు చెందిన వారు ఆక్రమించుకున్నారన్నారు. మా భూముల మేము సాగు చేసుకునే ప్రయత్నం చేయగా తమపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆయా భూముల్లోకి వెళ్లకుండా, అలాగే కొండపై దళితులు ప్రతిష్టించుకున్న మేరీమాత స్వరూపాల వద్దకు వెళ్లకుండా ఫెన్సింగ్ వేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని, అగ్రవర్ణాలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులకు, కలెక్టర్, డిఆర్‌ఒ, ఆర్‌డిఒకు గతంలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదన్నారు. తక్షణమే సిఐని, తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని, తమ భూములు తమకు ఇప్పించాలని, లేదంటే ఛలో సిఎం క్యాంపు కార్యాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూత్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నాయకులు కె.గౌతం, మోషే, పృధ్వీ, ఆర్.వాసు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పైపు లైను ఉన్నచోటే మరో పైపులైను

తాడేపల్లిలో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం

తవ్వేస్తున్న రోడ్లతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో కోట్లాది రూపాయలు వెచ్చించి మంచినీటి పైపులైన్ పనులు అధికారులు వేగవంతంగా చేస్తున్నారు. గతంలో ఉన్న పైపులైన్ స్థానంలో ప్రస్తుతం హెచ్‌డి పైపులైన్ పనులు జరుగుతున్నాయి. పైపులైన్లు బాగున్నా మళ్లీ ఇప్పుడు పైపులైన్లు వేయడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనం దుర్విని యోగం అవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ నిర్మాణం కోసం కృష్ణనగర్ ప్రాంతంలోని బ్రహ్మానం దపురం, ఉండవల్లి సెంటర్, తాడేపల్లిలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డు తవ్వేస్తు న్నారు. ఇళ్ల ముందు చక్కగా ఉన్న సిమెంట్ రోడ్లు పగలగొట్టడంతో స్థానికులు ఇక్కట్ల పాలవుతున్నారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను రెండు జోన్లుగా విభజించారు. మంగళగిరి ఒకటవ జోన్‌గా, తాడేపల్లి రెండో జోన్‌గా విభజించారు. ఇరవై ఏళ్ల క్రితం వేసిన పైపులు ప్రస్తుతం పనికిరాకుండా పోయాయని, వాటి స్థానంలో హెచ్‌డి పైపులైన్ వేస్తున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి చెప్పారు. తమ ఇళ్ల ముందు మంచినీటి పైపులైన్ ద్వారా మంచినీరు బాగాను వస్తున్నా ఇప్పుడు పైపులైన్ వేయాల్సిన అవసరమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంస్కరణల్లో భాగంగా చెత్తపన్నుతో పాటు నీటికి కూడా మీటర్లు పెట్టి, మంచినీటికి కొలతలు వేసి డబ్బులు వసూలు చేయడానికి ఈ పైపులైన్ వేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం అలాంటిదేమి లేదని కొట్టిపారేస్తున్నారు. గతంలో ఎలైన్‌పైపుల్ (సిమెంట్ పైపులు) ద్వారా వచ్చే మంచినీరు ప్రజల ఆరోగ్యానికి అంత మంచిదికాదని నిపుణులు చెప్పినట్లు అధికారులు చెబుతున్నారు. అందువల్లే పైపులైన్ మార్చాల్సివచ్చిందని అంటున్నారు. ఒకవేళ మీటర్లు పెట్టాల్సి వస్తే ముందుగా సమస్యల ప్రాంతాలు, అపార్టుమెంట్లలో మీటర్లు పెడతారని అధికారులు చెబుతున్నారు. మంచినీటికి మీటర్లు పెడితే ప్రజలకు డబ్బులు తగ్గుతాయని కూడా చెబుతున్నారు. ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లిలో ప్రస్తుతం ఇంటికి ఉన్న నీటి కుళాయికి నెలకు రూ.60 వసూలు చేస్తున్నారు. మీటర్లు పెడితే ఇంతకన్నా తగ్గుతాయని అధికారులు చెప్పడాన్ని ప్రజలు విశ్వసించడం లేదు. ఒకపక్క వివిధమార్గాల ద్వారా ప్రజల నుండి ఆదాయం రాబట్టుకోవాలని చూస్తున్న ప్రభుత్వం, నీటి మీటర్లు పెట్టి డబ్బులు తగ్గిస్తామని చెప్పడాన్ని కూడా ప్రజలు నమ్మడం లేదు. కొన్ని ప్రాంతాల్లో 20 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు పాడైపోయాయని చెప్పి ఇళ్ల ముందు రోడ్డు మీద జిఎ పైపులైన్ వేస్తున్నారు. దీనివల్ల తమ ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న మెట్లు పగలగొట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇళ్ల ముందు జిఎ పైపులైన్ వేసిన తర్వాత తమ వాహనాలు ఇళ్లల్లోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ డిఇ సుబ్బారెడ్డి ను నాలుగు రోజుల నుంచి వివరణ కోరుతున్నా, ఆయన వాయిదా వేస్తూ వస్తున్నారు.





అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

జిఎంసి స్పందనకు 35 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం గతవారం ఫిర్యాదుల పరిష్కారంపై విభాగాల వారీగా సమీక్షించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 35 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 6, ఇంజినీరింగ్ విభాగం 9, ప్రజారోగ్య విభాగం 3, రెవెన్యూ విభాగం 10, ఉపా సెల్ విభాగం కి సంబధించి 1, అకౌంట్స్ విభాగం సంబంధించి 6 ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని సంబంధిత అధికారులకు అందచేసి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటీప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిర్రావూరులో పశువైద్యశాలను పూర్తి చేయాలి

పాడిపశువులను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎపి రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ తెలిపారు. సోమవారం ఎంటిఎంసి పరిధి చిర్రావూరులో పశువులకు వ్యాధులు సోకుతున్నాయని సమాచారం తెలియడంతో శివశంకర్, రైతుసంఘం నాయకులతో కలసి పాడి పశువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు పాడి రైతులను వివరాలను అడిగి ఆయన తెలుసుకున్నారు. గ్రామంలో ఇప్పటికే గాలికుంటు వ్యాధి తో పశువులు ఇబ్బందులు పడుతున్నాయని, పశువులకు వ్యాధులు సోకినప్పుడు వైద్యం చేయించేందుకు సరైన ఆసుపత్రి లేకపోవడం వలన వేరే గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లా డుతూ తాడేపల్లి మండలంలోని అత్యధికంగా పశు సంపద ఉన్న గ్రామం చిర్రావూరన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి, పశు పోషణ చేస్తున్న రైతులు, అనుకొని విధంగా పశువులకు జబ్బు చేస్తే సరైన వైద్యం చేయించుకునేందుకు, గ్రామంలో పశువైద్యశాల లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనేక సంవత్సరాలుగా, అసంపూర్తిగా ఉన్న పశు వైద్యశాలను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహించారని ఆయన విమర్శించారు. తక్షణమే గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పశువైద్యశాలను పూర్తి చేసి, పశు వైద్యున్ని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి తాడేపల్లి మండల పశు వైద్యుడు నరేంద్ర రెడ్డిని ఫోన్లో సంప్రదించి, చిర్రావూరిలో పశువులకు వస్తున్న వ్యాధులకు వైద్యం అందించాలని ఆయన కోరారు. స్పందించిన పశు వైద్యుడు గ్రామంలోని పశువులకు పరీక్షలు నిర్వహించి, వాటికి వస్తున్న వ్యాధులను నిర్ధారణ చేసుకొని, తగిన వైద్య సదుపాయాన్ని కల్పిస్తామని నరేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, చిర్రావూరు గ్రామ రైతు సంఘం నాయకులు బొప్పన గోపాలరావు, మేడూరి పాములు, పల్లపాటి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నమక్కెనలో రీ సర్వే

ప్రజాశక్తి-పెదకూరపాడు



మండలంలోని చిన్న మక్కెనలో సోమవారం రీ సర్వే ప్రారంభించారు. రోవర్ మిషన్ తో ప్రతి రైతు పొలాన్ని ఉదయం రెండు టీములు, సాయంత్రం రెండు టీములు కోలాటం చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ క్షమారాణి, డిప్యూటీ తహశీల్దార్ నిర్మల కృష్ణ, సర్వేయర్ మాధవి, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల బృందం, సహాయకులు, సిబ్బంది, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అమరావతిలో రథోత్సవం

ప్రజాశక్తి-అమరావతి

స్థానిక శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దివ్య రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రధాన గాలిగోపురంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ట్రస్ట్ చైర్మన్ రాజా వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆర్డిఒ రాజకుమారి, ఆలయ కార్యనిర్వాహణాధికారి సునీల్‌కుమార్ తదితరులు కొబ్బరి కాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రెండు గంటల పాటు రథోత్సవం కొనసాగింది. ఎమ్మార్వో విజయ్ శ్రీ, ఎంపిడిఒ పి.మాధురి,సిఐ శివప్రసాద్,జడ్పిటిసి ఇడుపు గంటి కరుణ కుమారి, ఉప సర్పంచ్ నిమ్మా విజయ సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రాయడంపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు తమ నైపుణ్యతను పెంపాదించుకోవాలని ప్రముఖ గిన్నీస్ బుక్ రికార్డు హోల్డర్ సైకాలజిస్ట్ మొగిలి సుభాష్ అన్నారు. సోమవారం శావల్యాపురం మండలంలోని వేల్పూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల రాయడంపై మెళకువలు, అవగాహన సదస్సు నిర్వహించారు. సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను అధిగమించటానికి కష్టపడే తత్వం కల్గి ఉండాలన్నారు.



దాడిపై ఎస్పీకు ఫిర్యాదు

ప్రజాశక్తి-నరసరావుపేట

వైసిపి వర్గీయులు తమ కార్యకర్తలపై జరిగిన దాడి ఘటన పై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని కేసానుపల్లిలో టిడిపి, వైసిపి వర్గీయులు ఏర్పాటు చేసిన ప్రభలు కోటప్పకొండ తిరునాళ్లకు తరలిస్తున్న క్రమంలో ఈ దాడి జరిగిందని అన్నారు. కోటప్పకొండకు వచ్చిన ప్రభలలో టిడిపికి చెందినవి ఎక్కువ సంఖ్యలో ఉండడంతో వారు అసూయ పడి ఈ దాడి చేశారని అన్నారు. టిడిపి ప్రభ వద్ద వైసిపి గుండాలు విచక్షణా రహితంగా దాడి చేసి తమ నాయకుల తలలు పగలగొట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడ్డ వైసిపి వారిని వదిలేసి గాయాల పాలైన తమ వారిపై పోలీసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

'నవోదయం'తో నిరుద్యోగులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో నవోదయం ద్వారా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి నియామక పత్రాలను అందజేశారు. ఇటీవల నవోదయం ద్వారా పలువురు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో సల్లగుండ్ల బాల,బాలికల వసతి గృహంలో వాచ్ మెన్ లు గా ఇద్దరిని, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగానికి ఒకరిని నియమిస్తూ నియామక పత్రాలను కలెక్టర్ సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్ లో అందజేశారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారిలో చల్లగుండ్ల బాల,బాలికల వసతి గృహంలో వాచ్ మెన్ గా జాలాది కమల, నరసరావుపేట అంధుల వసతి గృహంలో వాచ్ మేన్ గా నక్క సుభాషిని, ఆఫీస్ సబార్డ్ నేట్‌గా గుండు మణికంఠలు ఉన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్‌కు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, చిన్నారులు,వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త ధన్యవాదాలు తెలిపారు.



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

వ్యాపారులు సక్రమంగా పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-నరసరావుపేట



పన్ను బకాయి దారులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

పట్టణ పరిధిలోని బకాయిదారులు ఇచ్చిన గడువులోగా పన్ను చెల్లించకపోతే పురపాలక శాఖా ఆధ్వర్యంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని ఆస్తి పన్ను వసూలు అధికారి అబ్దుల్ జబ్బార్ అన్నారు. గత కొన్ని నెలలుగా ఆస్తి పన్ను చెల్లించని బకాయిదారుల దుకాణాలపై సోమవారం దాడులు నిర్వహించారు.కొందరు పన్ను బకాయి దారులు అక్కడికక్కడే పన్ను చెల్లించి రశీదు తీసుకున్నారు.మరి కొందరు కొంత సమయం అడిగారు. బకాయి పన్ను వసూలు విషయంలో కఠినంగా ఉండాలన్న మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకే తాము వ్యవహరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆస్తిపన్ను బకాయి దారులు ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన చెల్లించాలని, పురపాలక శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. మునిసిపల్ ఆర్.ఐ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరునాళ్లను విజయవంతంగా పూర్తి చేశాం

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట

కోటప్పకొండ తిరునాళ్లను జిల్లా అధికారులు పోలీసులు కృషితో విజయవం తంగా నిర్వహించామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక గుంటూరు రోడులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 లక్షల మందికిపైగా భక్తులు తిరునాళ్లకు వచ్చారని చెప్పారు. కొన్ని గంటలు ట్రాఫిక్ ఇబ్బం దులు ఎదుర్కొన్నారని ఇప్పటికే అనేక మార్గా లను విస్తరించి మరమ్మతులు చేపట్టి ఇబ్బం దులు లేకుండా చేశామన్నారు. ఈ సారి తిరునాళ్లకు ఇంకా మరిన్ని మార్గాలను విస_్తరించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుం డా చేస్తామన్నారు. శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరునికి రూ 1.73 కోట్ల ఆదాయం లభించిందని గత ఏడాది కంటే రూ.5 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. కొండ పై ప్రాంతం విస్తరణకు బస్టాండ్ ఏర్పాటుకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తానని దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హామీ ఇచ్చారని చెప్పారు. రొంపిచర్ల మండలంలో కొనకంచివారిపాలెం, మునమాక గ్రామాల్లో కోడి పందేల నిర్వాహకులు ఏ పార్టీకి చెందిన వారైనా అరెస్ట్ చేయాలని ఎస్పీని కోరి నట్లు చెప్పారు. కాసినో ఏర్పాటు చేశారంటూ కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు.

డిసెంబర్ నాటికి శాశ్వత భూ హక్కు పత్రాలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పంపిణీ చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం వుందని తహశీల్దార్ భవానీ శంకర్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులు, మండల, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ ప్రారంభం కాని మండలాల్లో వెబ్ ల్యాండ్ డేటా తీసుకొని రీసర్వే బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ రికార్డుల నవీకరణకు కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని రైతులందరూ రీసర్వే బృందాలను సంప్రదించి వారికి భూమి వివరాలు సక్రమంగా వున్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-నూజెండ్ల



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు పుట్టినరోజు వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎంపిపి మేడం జయరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కేక్ కట్ చేసి బొల్లాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.ప్రసాద్, జడ్పిటిసి జె.సుబ్బులు రామయ్య,ఎంపిడిఒ జిలాని బాషా, తహశీల్దార్ జె.మధుబాబు, ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

వైవిరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - వినుకొండ

ఎపిఎస్ఆర్‌టిసి డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, ఎంప్లాయిస్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎపిజెఎసి అమ రావతి జనరల్ సెక్రటరి వైవిరావు సంతాప సభను స్థానిక కార్యాలయంలో సోమ వారం నిర్వహించారు. ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఎర్రజెండా నీడలో వైవి రావు అంచెలంచెలుగా ఎదిగి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతిష్టను, ఎపి జెఎసి, అమరావతి 101 సంఘాలను ఏకతాటిపై నడిపించిన వ్యక్తి అని కొనియాడారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం యూనియన్‌కు తీరని లోటని జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె హెచ్ బాబు, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్‌కె ఖాజా డిపో అధ్యక్షులు డి జి విన్సెంట్ , కార్యదర్శి పి. సాంబశివరావు అన్నారు. కార్యక్రమంలో కరిముల్లా ,గణప వరం శ్రీను, బాబురావు, పిల్ల శ్రీనివాసరావు, టీఎస్ రావు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో పరీక్షలకు సిద్ధంకండి

ప్రజాశక్తి-ఈపూరు: పౌష్టికాహారాన్ని తీసుకొని దృఢ సంకల్పంతో పరీక్షలకు సిద్ధం కావాలని పదో తరగతి విద్యార్థులకు జడ్పిటిసి తుర్లపాటి చౌడయ్య సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాంశాలలో సోమవారం విద్యార్థులకు అరటి పండ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని చౌడయ్య అన్నారు. చివరి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి నిమిషాన్ని విలువగా భావించాలన్నారు. లక్ష్యాలు నిర్దేశించు కుని శ్రమ చేయడం ద్వారా భవిష్యత్తులో మంచి స్థానాలు సాధించవచ్చన్నారు. **అచ్చంపేట:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని అచ్చంపేట జడ్‌పిటిసి విజయప్రతాపరెడ్డి ప్రారంభించారు. **నూజెండ్ల:** విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చునని ఎంపీపీ మేడమ్ జయరామిరెడ్డి, జడ్పిటిసి జడ్డా సుబ్బులు రామయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ములకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయండి

ప్రజాశక్తి- విజయపురిసౌత్



సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధుబాబు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పిటిజి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మధుబాబు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించి సమసమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ వర్గ బేధాలు లేకుండా కృషి చేయాలని, వివక్ష లేని సమాజం కోసం అందరూ పాటుపడా లని సూచిం చారు. **అమరావతి:** సమాజంలో ప్రతి వ్యక్తి ఎటువంటి అసమానలకు గురికాకూడదని, ఆర్థిక అసమానతను దూరం చేసి సమానత్వం పెంపొందించాలని అదే రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తుందని పారా లీగల్ వాలంటీర్ షేక్ ఖాజావలి అన్నారు. మండలంలోని లింగాపురం పంచాయతి కార్యాలయంలో సామాజిక న్యాయ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకం

ప్రజాశక్తి - యడ్లపాడు: ప్రస్తుతం రబి సాగులో చిరుధాన్యాల సాగు చేయడం వల్ల రైతులకు లాభదాయకంగా వుంటుందని ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థ , గుంటూరు నుండి వచ్చిన రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు అన్నారు. సోమవారం నర్సరావుపేట డివిజన్ యడ్లపాడు మండలం లింగారావు గ్రామంలో చిరుధాన్యాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమల కుమారి అధ్యక్షత వహించారు.

'జగనాసుర రక్త చరిత్ర' వాల్ పోస్టర్

ప్రజాశక్తి-నూజెండ్ల: మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో జగనాసుర రక్త చరిత్ర వాల్ పోస్టర్‌ను అంటించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బచ్చు అంజిరెడ్డి యూనిట్ ఇంచార్జ్ ఎల్. సూరి, టిడిపి గ్రామ అధ్యక్షులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.





రజక వృత్తిదారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి: గత నెల 28వ తేదీన ఉండవల్లి సెంటర్ సాంబశివ అపార్టుమెంట్‌లో లిఫ్ట్ వైరు తెగి తీవ్రగాయాలపాలైన రజకవృత్తిదారుడు కలిదిండి చంటి, అతని కుమారుడు కలిదిండి యశ్వంత్‌కు ఏపి రజక వృత్తిదారుల సంఘం యాజమాన్యంతో పలుమార్లు సంప్రదింపులు జరిపి రూ.38,500ల నగదును సోమవారం చంటి కుటుంబానికి అందజేశారు. చర్చల్లో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వరరావు, సహాయకార్యదర్శి బి.సుబ్బారావు, అపార్టుమెంట్, వాచ్‌మెన్, ఇస్త్రీదారుల సంఘం ప్రధానకార్యదర్శి పి.శ్రీనివాస్, ఉండవల్లి సంఘం నాయకులు ఎం.శ్రీనివాస్,కామరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి హ్యాపి హాస్పిటల్ వితరణ

ప్రజాశక్తి-తెనాలి:పట్టణానికి చెందిన హ్యాపి హాస్పిటల్ అధినేత డాక్టర్ వి.పావని ప్రియాంక తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా స్థానిక బాలాజీరావుపేటలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు శిక్షణ పొందే భవిత కేంద్రానికి రూ.50వేలు వెచ్చించి 17 కిటికీలకు మెష్‌లను సమకూర్చారు. అలాగే రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా వైస్‌చైర్మన్ ఎం.భానుమతి రూ.15వేలతో వీల్‌చైర్లను అందించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ మానసిక వైకల్యం కలిగిన చిన్నారులకోసం హ్యాపి హిస్పిటల్, రెడ్‌క్రాస్ సంస్థ చేసిన సాయం గొప్పదన్నారు. ప్రభుత్వ పరంగా భవిత కేంద్రం అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం, కౌన్సిరల్ మొఘల్ రహ్మత్‌భేగ్, ఫిజియోథెరపిస్ట్ శివనాగమల్లేశ్వరరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ డి.సునీత, సిబ్బంది జయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీటర్ థామస్

కళలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-తెనాలి:స్థానిక చెంచుపేటకు చెందిన నవచైతన్య కళామండలి కార్యాలయంలో సోమవారం పెయిటింగ్, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీపై వర్క్‌షాపు ప్రారంభించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాపులో నిర్వాహకులు డాక్టర్ పీటర్ థామస్ మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు వర్క్‌షాపును సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. లలిత కళలను ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డి.బాలరాజు, డి.ప్రవీణ్‌పాల్, రాజేంద్రబాబు, షాలేము రాజు, శిక్షణ బృందాలు పాల్గొన్నాయి.

రేపటి నుండి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి -మంగళగిరి:ఈనెల 22వ తేదీ నుండి 26వ తేదీ వరకు నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ టోర్నమెంట్ నియోజవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 40 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. వాటికి సంబంధించిన డ్రాను క్రీడాకారుల సమక్షంలో తీయడం జరిగిందన్నారు. విజేతలకు నగద బహుమతులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి టీ జానకి దేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలలతో అనితర విజయాలు

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని జీవితంలో అనితర సాధ్యమైన విజయాలను సొంతం చేసుకోవాలని 1వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మహ్మద్ రహంతుల్లా అన్నారు. స్థానిక కొత్తపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, వసతి సౌకర్యాలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లకు తలుపులు సరిగా లేవని గమనించి, త్వరతగతిని మరమ్మతులు చేయాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలను అవసరం మేరకే



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రహంతుల్లా

ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా సమాజంలో నెలకొంటున్న పరిస్థితులపై అవగాహన, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరీక్షణరావు, హెచ్‌డబ్ల్యూవో అనురాధ, ఒన్‌టౌన సిఐ కె.చంద్రశేఖరరావు, న్యాయసేవాదికార సంస్థ సిబ్బంది మహబూబ్, వై.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పనివత్తిడితో పారిశుధ్య కార్మికురాలికి అస్వస్థత

ప్రజాశక్తి - తుళ్లూరు

పనివత్తిడితో పారిశుధ్య కార్మికురాలు కొండమ్మ అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం తుళ్లూరులో చోటు చేసుకుంది. తుళ్లూరు ప్రాథమిక వైద్యశాలలో ఆమెకు చికిత్స అందించారు. నెక్కల్లులో ఎక్కువ మంది కార్మికులు ఉన్నారంటూ అక్కడ పనిచేసే కార్మికురాలు కొండమ్మను తుళ్లూరుకు మార్చడం, ఫేస్‌యాప్‌లో హాజరుసమయానికి వేయాలని వత్తిడి చేయడం తదితర కారణాలతో ఆమె పని ప్రదేశంలో స్పృహ తప్పి పడిపోయిందని తోటి కార్మికులు తెలిపారు. చికిత్స పొందుతున్న కొండమ్మను రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, సిఆర్‌డిఎ ఉద్యోగులు పరామర్శించారు. గత ఐదేళ్లుగా కొండమ్మ నెక్కల్లులోనే విధులు నిర్వహిస్తుండగా, తుళ్లూరు వెళ్లి పారిశుధ్య పనులు చేయాలని అధికారులు ఒత్తిడి పెట్టారన్నారు. నెక్కల్లులో ఉదయం ఐదున్నర గంటలకు ఫేస్ యాప్‌లో



కొండమ్మను పరామర్శిస్తున్న ఎం రవి తదితరులు

హాజరు వేయించుకొని అక్కడ నుంచి మండల కేంద్రం తుళ్లూరు వచ్చి విధులు నిర్వహిస్తున్న క్రమంలో పని ఒత్తిడి కారణంగా అస్వస్థతకు గురైందన్నారు. కనీసంగా కార్మికులకు రవాణా సౌకర్యం కల్పించకుండా రాజధాని గ్రామాల్లో ఎక్కడైనా పనిచేయాలని అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని రవి విమర్శించారు.ఇప్పటికైనా అధికారులు ఒంటెద్దు పోకడలు మాని, కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడటం మానాలని, కార్మికులకు జరగరానిది ఏమైనా జరిగితే దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవి హెచ్చరించారు.

నాగేశ్వరరావుకు ఇండియన్ ఐకాన్ 2023 పురస్కారం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ట్రస్టు బృందం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన విశ్రాత రెవెన్యూ ఉద్యోగి, రచయిత నూతలపాటి నాగేశ్వరరావు ఇండియన్ ఐకాన్ 2023 పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం తాను రచించిన 'అమృత కలశం' నవల రచనకు ఈ పురస్కారం లభించినట్లు చెప్పారు. తెలంగాణా రాష్ట్రం హనుమకొండకు చెందిన విజ్‌డమ్ చారిటబుల్ ట్రస్టు సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగేశ్వరరావును పురస్కారంతో సత్కరించారు. ట్రస్టు వ్యవస్థాపకులు నాగరాజు మాట్లాడుతూ ఎంతో సందేశాత్మకంగా రచనలు కొనసాగిస్తున్న నాగేశ్వరరావు భవిష్యత్‌లో మరింత ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును పులువురు సాహితీ ప్రియులు విశ్రాంత ఉద్యోగులు అభినందించారు.

భవిష్కత్‌లో నానో టెక్నాలజీదే కీలకపాత్ర

ప్రజాశక్తి -ఏఎన్‌యు

రాబోయే కాలంలో నానో టెక్నాలజీ కీలక భూమిక పోషించనున్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నానో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ' శక్తి మరియు ఉత్ప్రేరకం కోసం నానో పదార్ధాలు ' అనే అంశం పై సదస్సు ప్రారంభమైంది. సదస్సు ప్రారంభ సభకు డైరెక్టర్ బి.హరిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి పి.రాజశేఖర్ మాట్లాడుతూ వివిధ శాస్త్రాలలో నానో టెక్నాలజీ వినియోగం పెరగడం గురించి వివరించారు. ఆచార్య శ్రీకాంత్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నానో టెక్నాలజీ నాణ్యమైన భవిష్యత్‌ను



జ్యోతి ప్రజ్వల ద్వారా సదస్సును ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్ పట్టేటి

అందిస్తుందని చెప్పారు. ఈ సదస్సులో సదస్సు డైరెక్టర్ బి. హరిబాబు, రిజిస్ట్రార్ బి. కరుణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



రంగనాయకులను సత్కరిస్తున్న థియేటర్ కమిటీ

క్లారినెట్ విద్వాంసుడు రంగనాయకులుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

శకపురుషుని శతజయంతి పేరిట మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ధి ఉత్సవాల్లో సోమవారం ఎన్టీఆర్ నటించిన దక్షయజ్ఞం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన క్లారినెట్ విధ్వాంసుడు గానుగపెంట రంగనాయకులును థియేటర్ కమిటీ సభ్యులు కొల్లిపర రాఘవేంద్రరావు, పూసపాటి వెంకటేశ్వర్లు, ఈదర వెంకటపూర్ణచంద్, కె.చంద్ర, రావూరి హరీష్ సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.చలపతిరావు, పి.పోతురాజు, అయినాల మల్లేశ్వరావు, ఎం.రాఘవరావు, ఎస్.సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తారకరత్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడిపి నాయకులు

తారకరత్నకు టిడిపి నివాళి

ప్రజాశక్తి-తెనాలి

యువ నటుడు, నాయకుడు నందమూరి తారకరత్న మృతి బాధాకరమని పలువురు టిడిపి నాయకులు అన్నారు. స్థానిక కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం తారకరత్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారకరత్న నటుడుగానే కాకుండా టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ మనుమడిగా ప్రజలకు చేరువయ్యాడన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలనపై తీవ్రంగా మదనపడేవాడని, సామాన్యులకు మేలు జరగాలంటే టిడిపి అధికారంలోకి రావాలని ఆకాంక్షించిన తారకరత్న మృతి చెందటం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంటో టి. హరిప్రసాద్, కె.కనకరాంబాబు, అన్నం పన్నారావు, ఈదర శ్రీనివాసరావు, మాదల కోటేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, జి.ప్రసాద్, కె.ఏడుకొండలు, జె.మహేష్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- ఫిరంగిపురం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలో సోమవారం జరిగిన మండల కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. తాడికొండ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రతి ఒక్కరికి సంక్షేమం అందాలనే ఉద్దేశంతో వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. రీజనల్ కో-ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గృహ సారథులు, వాలంటీర్లు సమన్వ యంతో పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాలని సూచించారు.జడ్‌పిటిసి దాసరి కత్తి రేణమ్మ, ఎంపీపీ షహీలనర్గిస్, మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, చిట్టా బాపూజీ రెడ్డి, ఎం సుధాకర్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్ రెడ్డి, బి. అంజిరెడ్డి, ఎం సుధాకర్ రెడ్డి, జేమ్స్ చిన్నయ్యలు ఉన్నారు.

22, 23 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో తాగునీటి పైపు లైన్ల ఇంటర్ కనెక్షన్స్ పనుల కోసం ఈనెల 22, 23 తేదీల్లో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుండి హెచ్ఎల్ఆర్‌కు ప్రస్తుతం తాగునీరు సరఫరా చేస్తున్న 800 ఎం.ఎం.డయా పి.ఎస్.సి. పైప్‌లైన్ స్థానంలో, మెరుగైన సరఫరా అందించేందుకు 900 ఎం.ఎం.డయా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. అందులో భాగంగా సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద, హెచ్.ఎల్.ఆర్. కాంపౌండ్ వద్ద పాత లైన్ నుండి నూతన లైన్‌కు ఇంటర్ కనెక్షన్ పనులు 22వ తేదీ ఉదయం సరఫరా తర్వాత ప్రారంభించి, 23వ తేదీ సాయంత్రానికి పూర్తి చేయటానికి ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ పనుల నేపథ్యంలో స్థానిక లక్ష్మీపురం, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, ఏటి అగ్రహారం, మార్కెట్ యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కోర్ట్ కాంపౌండ్, కెవిపి కాలనీ, వికాస్‌నగర్, శ్యామలా నగర్, హనుమయ్య నగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాల బీడు, వసంతరాయపురం, శారదా కాలనీ రిజర్వాయర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందని, 24వ తేదీ ఉదయం నుండి సరఫరా యధావిదిగా జరుగుతుందన్నారు. నగర ప్రజలు ఈ అంశాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రానికి నేడు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెదనందిపాడు : పెదనందిపాడులో లావువారి చెరువు కట్ట వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని విజ్ఞాన కేంద్రం నిర్మాణ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్ దొప్పలపూడి రమేష్, కాకుమాను నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొంటారని, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు ప్రకటనలో కోరారు.



రాయపూడి, బోరుపాలెంలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తుళ్ళూరు మండలం రాయపూడి, బోరుపాలెం గ్రామాలలో చౌక ధరల దుకాణాలలో విజిలెన్సు అధికారులు సోమవారం తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. పేద ప్రజలకు పంపిణీ చేయవలసిన రేషన్ బియ్యంను ఈ గ్రామాలలో రేషన్ డీలర్లు కార్డు దారులకు పంపిణీ చేయ కుండా, అక్రమముగా తరలించి అమ్ము కొని, అక్రమ వ్యాపారం చేస్తున్నట్టు తమకు సమాచారం వచ్చిందని విజిలెన్సు అధికారులు తెలిపారు. స్థానిక పౌర సరఫరాల శాఖ అధికారుల తో కలసి ఈ గ్రామాల్లోని రేషన్ దుకణాల్లో తనిఖీ చేశారు. రాయపూడి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారిచే నడుప బడుచున్న రేషన్ షాపు నంబరు 21 ని తనిఖీ చేయగా, ఉండవలసిన నిల్వ కన్న బియ్యం 41 బస్తాలు తక్కువ ఉన్నట్లు కనుగొన్నారు. ఈ షాపు లో గల 21 బస్తాల బియ్యం, 150 పాకెట్స్ పంచదార, 75 కేజీల కందిపప్పు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేశారు. బోరుపాలెం గ్రామంలో జొన్నలగడ్డ విద్యచే నిర్వహిస్తున్న రేషన్ దుకాణంలో ఉండ వలసిన నిల్వ కన్న బియ్యం 51 బస్తాలు తక్కువ ఉన్నట్లు కనుగొన్నారు. విజిలెన్సు సిఐ శ్రీహరిరావు, స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.



సదస్సు జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎల్ అరుణ తదితరులు

26న చిలుమూరులో ఐద్వా వజ్రోత్సవ సదస్సు

జయప్రదం చేయాలని కరపత్రాలతో ప్రచారం

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల మండలం చిలువూరులో రామతులసి కళ్యాణ మండపంలో ఐద్వా వజ్రోత్సవ సదస్సు నిర్వహిస్తున్నామని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ సోమవారం తెలిపారు. సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతు చిలువూరులో 1947 సంవత్సరంలో మహిళా సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహించారని, ఈక్రమంలో 75 సంవత్సరాల తరువాత రాష్ట్ర మహాసభ జరిగిన గ్రామంలో సదస్సు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. చిలుమూరులో 26వ తేదీ ఆదివారం మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జెట్టి బాలరాజు, వి సాంబశివరావు, వి రాధ, పి ధరణి, ఎం స్వరూప, ఎం సాగర్ పాల్గొన్నారు.



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు సాంబిరెడ్డి తదితరులు



సర్పంచ్‌తో మాట్లాడుతున్న డిపివో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఇతర అధికారులు

ఎన్నాళ్లీ మురుగు నీళ్లు తాగాలి..!

- కొలకలూరు ఎస్సీ కాలనీ వాసులు రాస్తారోకో
- తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ - ఆందోళనకు సిపిఎం మద్దతు
- గ్రామానికి హుటాహుటిన వచ్చిన డిపిఒ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



పైపుల నుండి వచ్చిన కలుషిత నీరు



ఆందోళనకారులకు సర్దిచెబుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తెనాలి:

తాగునీరు కలుషితమౌతుంది. పైపుల్లో మురికి నీరు వస్తున్నాయి. అది కూడా అవసరానికి సరిపడా నీరు అందటంలేదు. అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టినా పట్టించుకోవటం లేదు. ఎనిమిది నెలల క్రితం నీరుకలుషితమై, డయేరియా బాలిక చనిపోగా, దాదాపు 200 మంది అస్వస్థతకు గురయ్యారు. అయినా అధికారుల్లో చలనం లేదు. కాళ్ళరిగేలా తిరిగి ప్రయోజనంలేక రోడ్డెక్కాం. ఇప్పటికైనా మా సమస్యను పరిష్కరించండి ...అంటూ రూరల్ గ్రామం కొలకలూరులో రాస్తారోకోకు దిగిన ఎస్సీకాలనీ వాసులు వాపోయారు.

నియోజకవర్గంలో మేజరు గ్రామ పంచాయతీ కొలకలూరు. దాదాపు 16వేల మంది ఓటర్లున్నారు. అయినా పాలకుల నిర్లక్ష్యం గ్రామాన్ని వీడటం లేదు. ముఖ్యంగా ఎస్సీ కాలనీపై తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. గతేడాది జూన్‌నెలలో తాగునీరు కలుషితం కారణంగా పదోతరగతి చదువుతున్న బాలిక డయేరియా బారిన పడి మృతి చెందింది. దాదాపు 200 మంది ఆసుపత్రి పాలయ్యారు. జిల్లా కలెక్టర్‌తో పాటు యంత్రాంగం కదిలింది, దాదాపు రెండు నెలల పాటు పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్నామంటూ, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు. తదుపరి కుళాయిల ద్వారా నీటిని విడుదల చేశారు. అతి కొద్దిరోజులు నీరు బాగున్నా, మరలా పరిస్థితి మొదటికొచ్చింది. తాగునీటిలో నల్లటి పొడి. తాగు నీరు బురదనీటిని తలపిస్తుండటంతో స్థానికులు గ్రామసచివాలయంలోను, సబ్ కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. ఎలాంటి స్పందన లేకపోవటంతో సోమవారం నందివెలుగు-గుంటూరు రోడ్డు కొలకలూరు కూడలిలో కాళీ బిందెలతో రాస్తారోకోకు దిగారు. కుళాయిలో వచ్చిన మురికినీటిని ప్రదర్శించారు. గ్రామంలో డయేరియా ప్రభలిన సమయంలో తాగునీటి సమస్యకు అద్దంపట్టిన ప్రజాశక్తి కథనాలను ప్లకార్డులుగా ప్రదర్శించారు. ఎస్సీ కాలనీలో పైప్‌లైన్లు కొత్తవి వేయాలని, కాలనీలోనే రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మించాలని, అధికారులు నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. దాదాపు గంట సేపు రాస్తారోకో జరిగింది. ఈలోగా రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పేప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ సురేష్, డీఈ ఎండి యాసిన్, ఈవోపిఆర్‌డి ప్రభాకర్, డిఎల్పీవో శ్రీనివాసనాయక్ గ్రామానికి చేరుకున్నారు. నీటిని పరిశీలించారు. జగనన్న కాలనీలో ఉన్న బోర్‌ను కూడా పరిశీలించారు. ఈ లోగా గ్రామ సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి అక్కడికి చేరుకున్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం, కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకోవటంలేదని కొందరు మహిళలు ఆమెతో వాగ్వాదానికి దిగారు. ఇదిలా ఉంటే సెక్రటరీ విద్యాసాగర్‌ను అధికారులు విచారించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బంది, నీటి కాలుష్యంపై ఆయన వారికి వివరించారు. తక్షణమే పైప్‌లైన్లు మార్పుకు అంచనా వేయాలని, ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సురేష్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ1.44కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు కూడా ఖరారయ్యాయని, తక్షణమే పైప్‌లైన్ మార్కింగ్ చేస్తారని, వచ్చేనెలలో పనులు కూడా ప్రారంభిస్తామని, సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తమని ఎస్ఈ చెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఆందోళనలో సుద్దపల్లి పృథ్వి, గొరిగపూడి బుజ్జి, వార్డు సభ్యులు కె.కోటేశ్వరి, కె.అరుణ, కాలనీ వాసులు సుద్దపల్లి రవిబాబు, ఉన్నం జాన్‌బాబు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సిపిఎం మద్దతు

కార్యదర్శికి వినతిపత్రం

తాగునీటి కలుషితం, అరకొర సరఫరాపై ఎస్సీ కాలనీ వాసులు చేసిన ఆందోళనకు సీపీఎం మద్దతు ప్రకటించింది. సిపిఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి గ్రామానికి చేరుకుని ఆందోళనకారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వాకికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొద్ది నెలల క్రితం గ్రామంలో డయోరియా ప్రభలి బాలిక మృతి చెందిందని, అలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. 40ఏళ్ళ క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్ పెరిగిన జనాభాకు చాలదని, కొత్త ట్యాంకు నిర్మించాలని, పాడైపోయిన పైప్‌లైన్‌ను పూర్తిగా మార్చాలని, మేజరు గ్రామపంచాయతీకి ఇన్‌చార్జి పాలన కాకుడా, రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు సంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన వెంట జ్యోతుల కోటేశ్వరరావు, పలువురు కాలనీ వాసులు ఉన్నారు.

సుందరయ్య నగర్‌లో రెడ్‌బుక్‌డే

ప్రజాశక్తి-గుంటూరు

రెడ్‌బుక్‌డే సందర్భంగా స్థానిక 41వ వార్డు పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో కాలనీ సిపియం శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం కవితా పఠనం కార్యక్రమాన్ని, కాలనీ అధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గోనే లూథర్‌పాల్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు సాహిత్యం, పుస్తకాలు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించిన ఫిబ్రవరి 21న రెడ్‌బుక్‌డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అభ్యుదయ సాహిత్యాన్ని ప్రజలకు చేరవేయటానికి ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు. సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రజలంతా ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సిపియం నగర నాయకులు షేక్.ఖాసిం షహీద్, ఆది నికల్సన్, షేక్.మస్తాన్‌వలి, శాఖ కార్యదర్శి కె.ఆంజనేయులు, కె.నాగమల్లేశ్వరి, ఎస్.పద్మనాభుడు, నాయుడు పద్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి నాయకులు లూథర్‌పాల్